క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కరాటే క్రీడాకారిణి సాయి అక్షితను అభినందిస్తున్న డీఈఓ

కర్నూలు(రూరల్): నగరంలోని ఎక్సెల్ అకాడమీ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బి.సాయిఅక్షిత జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఆమె శుక్రవారం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, పరమేష్‌తో కలిసి డీఈఓ శామ్యూల్ పాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ క్రీడాకారిణి సాయి అక్షితను అభినందించారు. గొందిపర్ల గ్రామానికి చెందిన సాయిఅక్షిత గత నవంబర్ 24, 25 తేదీల్లో అనంతపురం పట్టణంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 కరాటేలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటి బంగారు పతాకం సాధించినట్లు వారు చెప్పారు. ఆమె ఈ నెల 8, 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు కరాటే కోచ్ జగదీష్ తెలిపారు.

ఎమ్మార్పీ రేట్లకే పురుగు మందులు విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పురుగు మందులు, ఎరువులను రైతులకు విక్రయించాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పురుగుమందులు, ఎరువుల దుకాణాలను ఏఓ తనిఖీ చేసి స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు అడిగిన మందులను దుకాణదారులు విక్రయించాలని, అనవసరమైనవి అంటగట్టరాదన్నారు. దుకాణదారులు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఏఓ సూచించారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్‌లో 4రకాల పురుగుమందులు సేకరించి నాణ్యత ప్రమాణాల గుర్తింపునకు అమరావతి ల్యాబ్‌కు పంపించామని ఏఓ తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీపై గ్రామ సభలు



కంబదహాల్లో గ్రామసభను నిర్వహిస్తున్న డీఆర్‌పీ రాములు

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్, పలుకుదొడ్డి, చింతమానుపల్లె గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై జరిగిన తనిఖీ అంశాలపై శుక్రవారం డీఆర్‌పీలు ఆయా గ్రామాలలో సభలు నిర్వహించారు. కంబదహాల్ గ్రామంలో సుంకులమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేసిన గ్రామసభలో నివేదికలను డీఆర్‌పీ రాములు గ్రామస్తులకు చదివి వినిపించారు. గ్రామంలో 54 పనులు చేపట్టగా, రైతులు నాటుకున్న ఉద్యాన పంటలు ఎండిపోవడం, మస్టర్లలో తేడాలను గుర్తించినట్లు డీఆర్‌పీ తెలిపారు. అదేవిధంగా చింతమానుపల్లెలో 34, పలుకుదొడ్డిలో 48 పనులపై తనిఖీలు నిర్వహించిన డీఆర్‌పీలు హరిబాబు, కోటయ్య కొలతలలో తేడాలు, మస్టర్ల సమస్యలను గుర్తించినట్లు సభకు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రామన్న, ఈసీ పృధ్వీరాజ్, ఎంఈఓ - 2 ఆదామ్‌బాషా, టీఏలు, కూలీలు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా ఫ్లోరోసిస్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడి, చుట్టా, సిగరెట్, తంబాకు, పాన్ మసాల, వంటి వాటిని ఉపయోగించడం వల్ల ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అధిక స్థాయిలో ఫ్లోరైడ్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకున్నా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉందన్నారు. ఫ్లోరోసిస్ వలన వికారము, వాంతులు, ఆకలి మందగించడము, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరము, దంతాలు రంగు మారడం, తరచుగా మూత్రము రావడము, అధికంగా దాహం, కండరాలు, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తాయన్నారు. తాజా ఆకు కూరలు, పాలపదార్థాలు, తాజా పండ్లు, విటమిన్-సి ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్ కుమార్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు ఉషారాణి, కృష్ణవేనమ్మ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలు ఆవిరి !

- గద్దెనెక్కాక మాటమార్చిన కూటమి సర్కార్
- ఎన్నికల ముందు రూ.10 వేల పారితోషికం ఇస్తామన్న చంద్రబాబు
- పాణ్యం నియోజకవర్గంలో సేవలందించిన 1,013 మంది వలంటీర్లు
- ప్రభుత్వ తీరుపై అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు

గడివేముల: కూటమి సర్కార్ ఆరునెలల పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాల అమలు జాప్యం, ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించిన తీరును అన్నివర్గాల ప్రజలు తప్పుపడుతున్నారు. అవసరం మేరకు ప్రజలను మభ్యపెట్టడం... అనంతరం మాట మార్చడం కొత్తేమీ కాదని నిరూపించుకుంది టీడీపీ. ఇందుకు ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీని విస్మరించి మాటమార్చడం ఓ ఉదాహరణ. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు నాయుడు వలంటీర్లపై ప్రేమ వలకబోశారు. మీ సేవలకు రూ. 5 వేలు ఏ మాత్రం సరిపోదని, రూ. 10 వేలు చెల్లిస్తామని నమ్మబలికాడు. బాబుతో పాటు కూటమి పెద్దలు హామీలు గుప్పించడంతో ఎంతో ఆశపడ్డారు వలంటీర్లు. ఎట్టకేలకు కూటమి సర్కార్ కొలువుదీరింది. సీఎం గద్దెనెక్కారు చంద్రబాబు నాయుడు. ఇక హామీలు అమలు చేయాల్సి ఉంది. ఆరు నెలలు గడిచిపోతుంది. అయితే వెంటనే కూటమి పెద్దలు మాటమార్చేశారు. అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వ ప్రతినిధులు వలంటీర్ వ్యవస్థే లేదుకదా అంటూ మాట్లాడిని తీరుపై అన్నివర్గాలు తప్పుపడుతున్నాయి. దీంతో సీఎం చంద్రబాబుపై వలంటీర్లు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. సీఎం చంద్రబాబు తమకు రూ. 10 వేలు చెల్లిస్తారని ఎదురు చూసిన వలంటీర్లకు నిరాశే మిగింది. పాణ్యం నియోజకర్గంలో గత ప్రభుత్వంలో ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందజేసిన 1,013 మంది వలంటీర్లు ప్రభుత్వ పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీని విస్మరించిన సీఎం చంద్రబాబు తీరుపై వలంటీర్లలతోపాటు ప్రజా, కుల సంఘాల నాయకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అందరి మన్ననలు పొందని వలంటీర్లు

ప్రజలకు నేరుగా సేవలు అందజేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఒక్కో వలంటీర్‌కు యాభై కుటుంబాల కేటాయింపు జరిగింది. ఇంటి వద్దనే పింఛన్ పంపిణీతోపాటు ఆరోగ్యం, వివిధ దరఖాస్తులకు సంబంధించి ఆయా కుటుంబాల సభ్యులుగా వ్యవహరించారు వలంటీర్లు. అర్హులందరికీ పింఛన్ మంజూరు చేయించారు. ప్రభుత్వ పథకాలను ఇళ్ల వద్దేకే చేర్చారు. ప్రత్యేకించి కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందజేసిన సేవలు ఎవ్వరూ మరిచిపోలేరు. కరోనా బాధితులకు కుటుంబ సభ్యులు దూరంగా ఉన్నా వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం మెచ్చుకున్నారు. కూటమి సర్కార్ వలంటీర్ వ్యవస్థే లేదనడంతో ప్రతిఒక్కరూ ఆశ్చర్యానికి గురువుతున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు అందజేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. టీడీపీ తీరును తప్పుపడుతున్నారు ప్రజలు.



శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామలక్ష్మమ్మకు పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీరు సుభాషిణి (ఫైల్)



వృద్ధురాలి ఐరిష్ తీసుకుంటున్న వలంటీరు శ్రీనివాసులు (ఫైల్)

మాట తప్పిన చంద్రబాబు



ఎన్నికలప్పుడు వలంటీర్లను కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాకా తప్పారు. ఎన్నికల్లో గెలవడానికి హామీలిచ్చి మోసం చేయడం తగదు. వలంటీర్లను నాయకులను తయారు చేస్తానని మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారమే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతాయి. ఇంత అన్యాయం చేస్తారని ఊహించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయాలి.

–మండ్ల మమత, సర్పంచ్, దుర్వేశి

అంకితభావంతో సేవలు చేశాం



ప్రజలకు అంకితభావంతో సేవలు అందజేశాం. తమకు కేటాయించిన ఇళ్ల వరకు మా కుటుంబ సభ్యులుగా భావించి అన్నివిధాలుగా అండగా నిలిచాం. కోవిడ్ సమయంలో ప్రాణాలు తెగించి సేవలందించాం. మంచి పనులు చేస్తూ ఆదుకుంటున్న చిన్నాటి గౌరవవేతనాన్ని కూడా మాకు దక్కకుండా చేయడం ఎంత వరకు సమంజసం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అమలు చేయాలి.

– ఎల్ల రాముడు, వలంటీరు,గడివేముల

వ్యవస్థ లేకుంటే.. వేతనం ఎలా ఇస్తామన్నారు?



వలంటీరు వ్యవస్థ లేకుంటే కూటమి పెద్దలు రూ.10 వలే ఇస్తామని ఎలా హామీ ఇచ్చారు. వలంటీర్ల సేవలు అందరి మన్ననలు పొందిన విషయం కూటమి పెద్దలకు కూడా తెలుసు. అందుకే ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే కేవలం గత ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థ కాబట్టే రద్దు చేస్తున్నారు. ఇష్టం లేనప్పుడు ఎన్నికల ముందే వలంటీరు వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించాలి ఉండాల్సింది. ఇప్పటికైనా న్యాయం చేయాలి.

–పెద్దరాజు, వలంటీరు, గడివేముల

కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు భయపడొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: రాష్ట్రంలో అమలు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు భయపడవడాల్సిన అవసరం లేదని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని శకునాల గ్రామంలో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బీరం పుల్లారెడ్డి నిర్వహించిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలను ప్రజలు చూస్తున్నారన్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వంలో ఇబ్బందులు పడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వాధికారులు కూటమి నాయకులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు,నాయకులకు,కార్యకర్తలకు ఎల్లవేళలా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, స్థానిక నాయకులు శివారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మేఘనాధరెడ్డి, రాము,క ల్లూరు, పాణ్యం ముఖ్య నాయకులు పాల్నొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

గడివేముల: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎజాస్ అహ్మద్‌పై దాడి చేసి ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడివేముల మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మొదటగా ఉపాధ్యాయుడు ఎస్. ఎజాస్ అహ్మద్ మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో కొంతమంది విద్యార్థులు గొడవపడడాన్ని ఉపాధ్యాయుడు నివరించే ప్రయత్నం చేయగా ఆయనపై దాడి చేసి ఆయన మరణానికి కారణం కావడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గడివేముల మండల శాఖ అధ్యక్షుడు ఎం. ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, నాయకులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, మారెన్న, శ్రీరాములు, మల్లికార్జునయ్య, అనిల్, కోమలమ్మ, చంద్రావతి, లక్ష్మీప్రసన్న, ఆదిశేషమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానం ప్రాంగణంలో ఏడాది గడువులో తాత్కాలికంగా వ్యాపారాల నిర్వహణకు సంబంధించి ఈ నెల 6వ తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటలను వాయిదా వేసినట్లు ఈఓ మద్దిలేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటను తిరిగి ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు మార్పును గమనించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి బాస్కెల్‌బాల్ పోటీలకు ఆర్జీఎం విద్యార్థులు

పాణ్యం: రాష్ట్రస్థాయి సీనియర బాస్కెల్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 వరకు తూర్పుగోదావరి జిల్లా మార్టుర్ జరిగే 10 ఏపీ సీనియర్ పురుషుల, మహిళలు రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో ఈసీఈ విద్యార్థిని తన్మయి, సీఎస్ఈ నవ్య, జయశ్రీ, రాజేశ్వరి పాల్గొంటారన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



బలపనూరులోని ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న డీపీఓ జమివుల్లా



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

పాణ్యం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల డీపీఓ, మండల ప్రత్యేక అధికారి జమివుల్లా సూచించారు. మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆమె ప్రజలతో మాట్లాడారు. అన్ని రకాల సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, వీఆర్ఓ శివశంకర్, గ్రామకార్యదర్శి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 22 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు: మండలం పెద్దపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకువాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ బస్టాండ్‌లో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అత్యధికంగా ఆర్ఓఆర్ సమస్యలపై అత్యధికంగా 72 వినతులతోకలిపి వివిధ సమస్యలపై మొత్తం 93 దరఖాస్తులు వచ్చినట్లు వీఆర్వోలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి, మత్స్యశాఖ ఏడీ సంధ్యారాణి, గూడూరు సబ్ రిజిస్టర్ అనిత, దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, ఇతర శాఖల అధికారులు, ప్రజలు, నాయకులు ఉన్నారు.

కోడుమూరు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వివిధ రకాల భూసమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలన్నింటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో మొత్తం 37మంది రైతులు వివిధ రకాల భూ సమస్యలపై అర్జీలిచ్చారు. కార్యక్రమంలో ఏడీపీ సాలురెడ్డి, ఎంపీడీఓ రాముడు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో శుక్రవారం మండల స్పెషలాఫీర్ సబియా పర్వీన్, తహసీల్దార్ రామాంజినేయులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 13మంది రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు.

రెవెన్యూ సదస్సుకు ఒక్క వినతి

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని దేవమడ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ టీవీ రమేష్ బాబు రెవెన్యూ సదస్సు నిర్వమించారు. అయితే కేవలం ఒకేఒక దరఖాస్తు రావడం గమనార్హం. నిరంజన్ అనే రైతు తన భూమికి హద్దులు చూపాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

కల్లూరు: మండల పరిధిలోని పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌కేర్ విద్యార్థులు పెంచికలపాడు గ్రామంలోని విశ్వభారతి హాస్పటల్‌ను సందర్శించారు. డాక్టర్ సైఫుల్లా విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్, ఐసియూ గురించి వివరించారు. ఎలక్ట్రికల్ విద్యార్థులు కె.నాగలాపురంలోని 33కెవి/11కెవి సబ్‌స్టేషన్ సందర్శించారు. విద్యుత్ సరఫరా తీరు గురించి ఆపరేటర్ శ్రీధర్‌రెడ్డి వివరించారు.

పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయండి

సి.బెళగల్: మెగా పేరేంట్స్ మీటింగ్‌ను శనివారం ప్రతి స్కూల్‌లో నిర్వహించి విజయవంతం చేయా లని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్ బాషా శుక్రవారం ప్రకటనలో పిలుపినిచ్చారు. హెచ్ఎంలు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సి.బెళగల్ బీసీ హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: హాస్టళ్లను సిబ్బంది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు అవసరమైన వసతులు సౌకర్యాలను సమకూర్చాలని ఏబీసీడబ్ల్యూఓ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. సిబ్బందిపై ఫిర్యాదులు రావడంపై ఆయన మండిపడ్డారు. పద్ధతి మార్చుకోని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని ఆయన ఇన్‌చార్జ్ వార్డెన్ రాముడును ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీఓ రాణెమ్మ, ఈఎంఓ - 2 ఆదామ్‌బాషా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సిబ్బందిపై చర్యలు

విద్యార్థులు, ప్రజా సంఘాల సభ్యుల ఫిర్యాదు మేరకు హాస్టల్లో విచారించిన అధికారుల నివేదికల ఆధారంగా హాస్టల్ సిబ్బందిపై జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మమ్మ చర్యలు చేపట్టాని వార్డెన్ రాముడు తెలిపారు. హాస్టల్ వాచ్‌మెన్ జనార్దన్‌గౌడ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారని, కమాటీ లాబన్న డిప్యూటేషన్ రద్దు చేసి ఎమ్మిగనూరు హాస్టల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వార్డెన్ తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్



గూడూరులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, చైర్మన్, వైస్ చైర్మన్లు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా, నాయకులు

కోడుమూరు రూరల్: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్.అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ కొనియాడారు. శుక్రవారం అంబేడ్కర్ 68 వర్ధంతిని పురస్కరించుకొని గూడూరులో ఆయన విగ్రహానికి నగర పంచాయతీ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్.అస్లామ్, లక్ష్మన్నతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బాల్యం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని స్వయంకృషి, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఎంతో ఉన్నతస్థాయికి ఎదిడారన్నారు. డా.బీఆర్.అంబేడ్కర్ అడుగు జాడల్లో నడిచి ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమార్, మద్దిలేటి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆబేలు, సత్యాలు, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో...

డా.బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కోడుమూరులోని అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మాజీ ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లారెడ్డి, ముల్లా సలీం, శివరాముడు, బోరెల్లి సోమన్న, జగదీష్, మాసుమ్, లక్ష్మిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా, కుల సంఘాల నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కోడుమూరు గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మునిస్వామి తదితరులు డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సి బెళగల్: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ మండల కన్వినర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, బాయికాటి మద్దిలేటి, గోపాల్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఎస్ఎం బాషా, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్ రషీద్, ఉప సర్పంచ్ ఎస్ఎం ఇబ్రహీం, వార్డు సభ్యుడు మద్దిలేటి, నాయకులు లచ్చప్ప, లింగేష్, కార్యకర్తలు దనియేల్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వైస్ ఎంపీపీ నెహెమ్యా పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ త్యాగాలను ఈసందర్భంగా నెహెమ్యా గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరపోగు మోహన్ బాబు, సలీం, బోయ చంద్ర, ఇ.తాండ్రపాడు మాజీ సర్పంచ్ గోపాల్ మేకలయ్య, మధుసూదన్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.